# రాయి సెంటర్ల బలోపేతానికి కృషి



వాంకిడి : సావాతి గ్రామం ఆత్మీయ సమేళనంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

వాంకిడి,జూన్ 12: కనుమరుగవుతున్న రాయి సెంటర్ల బలోపేతానికి కృషి చేస్తామని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మండలంలోని సావాతి గ్రామంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే,ఐ టీడీఏ పీవో ఖుష్బూగుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, వాంకిడి ఎంపీపీ ముండే విమలాబాయి, వాంకిడి జడ్పీటీసీ అంజయ్ కుమార్‌తో కలిసి ఆమె ఆదివాసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాయి సెంటర్లకు అధికారులు వచ్చి ఆదివాసీ గిరిజనుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకు ముందు గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించారు.

**మంత్రి సీతక్కకు వినతి**

రెబ్బెన, జూన్ 12: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా కమిటి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించినట్లు బెల్లంపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ నాయకుడు సంగెం ప్రకాశ్‌రావు పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో కలిసి ఐఎన్‌టీయూసీ నాయకులు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. గోలేటి ఓసీపీ తొందరగా ప్రారంభించాలని, గోలేటిటౌన్‌షిప్, మాదారంటౌన్‌షిప్‌లోని క్వార్టర్లను సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు కేటాయించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని, బెల్లంపల్లి ఏరియా దవాఖానకు ప్రత్యేక వైద్యులను నియమించాలని వినతిపత్రం ద్వారా కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లగొండ సదాశివ్, రాజన్న, ఏరియా కార్యదర్శి మాధవకృష్ణ, చంద్రకుమార్, బూర శ్రీనివాస్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గోలెం గట్టయ్య, పిట్ కార్యదర్శి భాస్కరచారి, రవికుమార్, అసిస్టెంట్ కార్యదర్శి కొవ్వూరి శ్రీకాంత్, నాయకులు బోయిన రాజేశం, సొగాల వామన్, దుర్గం రవీందర్, దాసరి సాంబగౌడ్, జిల్లాల స్వామి, దుర్గం తిరుపతి, పూదరి సాయి తదితరులు ఉన్నారు.

**ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి..**

22 జీవో అమలు చేయాలని, హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని మంత్రి సీతక్క కు ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రం అందించారు. కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు రాయిళ్ల నర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి చల్లూరి అశోక్ పాల్గొన్నారు.

**మంత్రికి ఘన స్వాగతం**

జిల్లాకు వచ్చిన మంత్రి సీతక్కకు గోలేటి టౌన్‌షిప్‌లో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. సింగరేణి గేస్ట్‌హౌస్‌లో బస చేసేందుకు రాగా, పలువురు నాయకులు మార్యద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల రక్షణ పోలీసుల బాధ్యత

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్
- బూర్గుపల్లిలో 1200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది

భీమారం, జూన్ 12 ప్రజల, రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని, నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. భీమారం మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. 17 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోగా, గుడుంబా తయారీకి సిద్ధంగా ఉన్న 1200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే డయల్ 100 కు కాల్ చేయాలని, సైబర్‌నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్‌కు, మెసెజ్ వాట్సాప్ కాల్స్‌లకు స్పందించవద్దని సూచించారు. స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను గ్రామాల్లో ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సర్కిల్ సీఐ మోహన్, భీమారం, జైపూర్, శ్రీరాంపూర్ ఎస్‌ఐలు రాములు, సంతోష్, నాగరాజు, ఎక్సైజ్ ఎస్ఐ శంకర్, సిబ్బంది ఏఎస్ఐ శకుంతల, సిబ్బంది సంపూర్ణ, మాచర్ల, ముత్తయ్య, మహేశ్‌బాబు తదిరులు పాల్గొన్నారు.

## 'లక్ష్యానికి చేరువ'

నస్పూర్, జూన్ 12 : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో లక్ష్యానికి చేరువలోకి వచ్చినట్లు మంచిర్యాల అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 286 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 24,532 మంది రైతుల నుంచి 1,55,330 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. రూ.263.53 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు.

# మనిషి ఉన్నతికి చదువే ప్రధానం

- ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి
- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



రాపల్లిలో విద్యార్థులకు నోట్ బుక్స్, యూనిఫాం అందజేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

హాజీపూర్, జూన్ 12 :ప్రతి మనిషి ఉన్నత స్థాయికి చేరాలంటే చదువే ప్రధానమని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. 2024-25 విద్యా సంవత్సరం పాఠశాలల పునఃప్రారంభంలో భాగంగా బుధవారం హాజీపూర్ మండలంలోని ముల్కల్ల, రాపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా డీఈవో యాదయ్య, డీఆర్డీవో కిషన్‌తో కలిసి విద్యార్థులకు ఏక రూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా వసతులు, నిష్ణాతులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్, ఇంజినీర్లు, ప్రజా ప్రతినిధుల్లో చాలా మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే ఉన్నారని గుర్తు చేశారు. విద్యార్థులకు పాఠశాలల ప్రారంభం రోజునే ఏకరూప దుస్తులు ఉద్దేశ్యంతో స్వయం సహాయక సంఘాల సహాయంతో దాదాపు 43 వేల యూనిఫాం జతలు కుట్టించినట్లు తెలిపారు. పాఠశాలల్లో నెలకొన్న మరమ్మతు పనులు, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొమ్మగణపతి రెడ్డి, తహసీల్దార్ సతీశ్‌కుమార్, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణ మూర్తి, గ్రామ సమాఖ్య సంఘం సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థినికి ఆర్థిక సాయం..**

పదవ తరగతిలో ముల్కల్ల ప్రభుత్వ పాఠశాలలో చదివి అధిక మార్కులు సాధించిన బుధారపు అర్చనకు ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నాయికిని సురేందర్ రూ.10 వేల నగదును కలెక్టర్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు.

**మిషన్ భగీరథ సర్వే యాప్ పరిశీలన**

హాజీపూర్ మండలంలోని గుడిపేట గ్రామంలో నిర్వహించిన మిషన్ భగీరథ సర్వేను బుధవారం మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే వివరాలు, వివరాలు నమోదుకు యాప్ వినియోగించే విధానంపై పంచాయతీ కార్యదర్శి మల్లేశ్‌ను అడిగి తెలుసుకొని వినియోగదారుల వివరాలను కలెక్టర్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సతీశ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాల కబ్జాపై విచారణ చేయాలి



నివేదిక చదివి వినిపిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్

సిర్పూర్(టీ), జూన్ 12 : ఆక్రమణను గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి, వాటిపై విచారణ చేపట్టాలని మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ఈర్త సత్యనారయణ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడీగా సాగింది. శాఖల వారీగా అధికారులు నివేదికలు చదివి వినిపించారు. మండలకేంద్రంలోని వ్యవసాయ శాఖ పాత గోదాం అన్యక్రాంతమైందనీ, దానిపై విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. వెంచర్ల పేరుతో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వెంచర్ల వివరాలను రెండు, మూడు రోజుల్లో సభ్యులకు వివరాలను అందజేయాలని ఎంపీపీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు సుహేల్ అహ్మద్, తుకారం, లావుడ్యా మంగీలాల్, ఎల్ములే సరిత, తాహెరా బేగం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ మహిళ మృతి

- దవాఖాన ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన



మణికంఠ నర్సింగ్ హోం ఎదుట బైఠాయించిన మృతురాలి కుటుంబ సభ్యులు

కాగజ్‌నగర్, జూన్ 12: కాగజ్‌నగర్ మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన కృష్ణవేణి(27) పట్టణంలోని మణికంఠ నర్సింగ్ హోం ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజుల క్రితం క్రిష్ణవేణికు జ్వరం, ఒళ్లు నొప్పులు రావడంతో మణికంఠ నర్సింగ్ హోం ప్రైవేట్ దవాఖానలో చేరింది. చికిత్స అందిస్తున్న క్రమంలో బుధవారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వైద్యులు ఇచ్చిన ఇంజెక్షన్ వికటించడంతోనే మృతి చెందిందని కుటుంబీకులు ఆరోపిస్తూ నర్సింగ్ హోం ఎదుట ఆందోళన చేశారు. రూరల్ సీఐ రాంబాబు, రూరల్ ఎస్ఐ సోనియా అక్కడి చేరుకొని వారితో మాట్లాడారు. వైద్యుడు శివదర్శనం మాట్లాడి వివరాలు సేకరించారు. మధ్యవర్తులు సముదాయించడంతో ఆందోళన విరమించారు. మృతురాలికి భర్త పడికెల పర్వతాలు, కూతురు కావ్యశ్రీ, కుమారుడు శివ తేజ ఉన్నారు. ఈ విషయంపై డాక్టర్ శివదర్శనాన్ని వివరణ కోరగా జాండీస్, ఇతర ఆరోగ్య సమస్య కారణంగా మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

# ఆర్కే 7గనిలో కార్మికుడికి గాయాలు

శ్రీరాంపూర్, జూన్ 12 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7గనిలో బుదవారం ఉదయం ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మల్లెపూల అనిల్ జనరల్ మజ్దూర్ కార్మికుడి ఎడమ కాలు విరిగింది. వెంటనే ఏరియా దవాఖానకు తరలించి చికిత్స అందించారు. గనిలోని 2వ సీం 17 రేస్‌లో ప్యానల్స్(రెస్టారెంట్) పనులు నిర్వహిస్తుండగా ఒక ప్యానల్ అనిల్ కార్మికుడి కాలుపై పడిందని కార్మికులు తెలిపారు. ఈ ప్రమాదంలో అనిల్ కాలు విరిగింది. గనిలో అధికారుల పని ఒత్తిడి, అవసరం లేని చోట పనులు చేయించడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు.


